ఆడవాళ్ళ పెట్టెలో ప్రయాణం.

నేను ఢిల్లీ నుంచి బయలుదేరిన దగ్గరనుంచీ, రకరకాల మనుష్యులు ఎక్కుతూ, దిగుతూవున్న వాళ్లని, చూస్తూ, కాలక్షేపం చేస్తున్నా. నేను కూర్చున్నది రెండవ తరగతి ఆడవాళ్ల పెట్టె. మధ్య మధ్య కొంచెము చోటు ఇస్తారా? అనీ, 'ఎంత వరకూ వెడతారూ?' అని యిల్లాంటి ప్రశ్నలు తప్ప పెద్ద సంభాషణ ఎవరితోటీ జరుగలేదు.

ఆ పెట్టెలో మొదటినుంచి వున్నవాళ్లు నలుగురము. ఒకామె పైన పడుకునే వుంటుంది, ఇంకొక ఆమె ఒకమూల పూర్తిగా సామానుతోటి, ఇద్దరు పిల్లలతోటి సొంతం చేసుకుంది—ఆమె వస్త్రధారణని బట్టి ఆంగ్లో ఇండియన్ స్త్రీ అనుకోవాలి. ఇంకో ఆమె మధ్యసీటులో కూర్చుని వచ్చేపోయే తినుబండారాలు అన్నీ కొనుక్కుని నోటికి విరామం లేకుండా తింటూ వాటితాలూకు తొక్కలు, కాగితాలు, ఆకులు, బైట వెయ్యమని, ఎవరు తనకేసిచూస్తే వాళ్ళకి పురమాయిస్తోంది—ఆవిడ వేషధారణ దక్షిణాది వాళ్ళకి చెందినట్లువుంది. అడ్డ చారల చీర, మెరిసే కమ్మలు, లావు పెదిమలు దగ్గర వంకులు వున్న చింపిరి జుట్టు, పొట్టిగా, లావుగావున్నా, నవ్వినప్పుడు కళగా వుండే మొహం. అన్నట్టు పడుకునే వున్నావిడ విషయం చెప్పటం మరిచా. సన్నగా, పొడుగ్గా వెలిసిపోయే రంగులోంచి వచ్చిన తెలుపులాంటి వంటిరంగు. చిన్నకళ్ళు, పొడుగుముక్కు సన్నగా గీట్లులాంటి పెదిమలు, నున్నగా తాళ్ళలాంటి జుట్టు

అన్నీ విడివిడిగా చూస్తే బాగానేఉన్నా మొత్తంగాచూస్తే వెలవెలపోయే కళలేని మొహములా కనపడుతుంది. ఆవిడ వేషధారణబట్టి గుజరాతీవాళ్లు అనుకోవచ్చు. ఇంకో మూల ఆక్రమించుకున్నది నేనూ అనుకోండి. ఎక్కడైనా రైలు ఆగితే 'యిది ఏ స్టేషను' అని పడుకున్న ఆవిడ హిందీలో అడగటం, ఎవరోవకరు 'ఫలానా'అని చెప్పటం జరుగుతోంది. మధ్యన కూర్చున్నావిడ ఏదైనా కొనే ప్రయత్నములో కిటికీదగ్గరికి వెళ్లినప్పుడు ఆవిడ స్థూలశరీరంలో భాగం పిల్లలమీద ఆనుకుని, వాళ్లు కియ్యోమని కేకవెయ్యటం—వాళ్ల అమ్మ ఇంగ్లీషులో ఆవిడతోటి దెబ్బలాడటం, మళ్ళీ కొంత సేపయినాక ఎవరి చోట్లో వాళ్ళు మొహాలు మాడ్చుకుని ధుమధుమలాడుతూ కూర్చుని ఒకరు చూడకుండా రెండోవారు చూసుకుంటూ, మళ్లీ మధ్యలో ఎవరైనా కొత్తవాళ్లు నక్కితే-యివి మర్చిపోయి వాళ్లని చూస్తూ వెళ్లబుచ్చుతున్నారు. నేను కిటికీదగ్గరే వున్నాను కనుక నాకు ఏమయినా కావలిస్తే నేనే కొనుక్కుని నా బాధ యితరులకి లేకుండా కిటికీలోంచి బయటికి చూస్తూ నాకు వీడ్కోలు యిచ్చేందుకు వచ్చేటట్లు వుండే చెట్లని, రైలు ముందుకు పోతూవుంటే నేను వెనక్కి వంగి చూస్తూ మళ్లా ఎన్నాళ్లకో మిమ్మల్ని చూడ్డము అనేభావంతో దిగులుగా చూస్తూ నన్ను వెళ్లమని చేతులు వూపుతున్నట్లు వుండే వాటి 'నీడ' లని చూస్తూ కాలం గడుపుతున్నా.

ఎన్నో స్టేషన్లు వస్తూ, వెడుతున్నాయి. జనం గుంపులు ఎక్కుతున్నారు. దిగుతున్నారు. కొందరు మైలురాళ్ళలా వున్న మా నలుగురునీ వాళ్ళ వాళ్ల భాషలో శాపనార్థాలు

పెడుతున్నారు. పూర్తిగా దెబ్బలాడి హక్కులు బలపర్చు కుందామనే వుద్దేశ్యము వున్నా, మళ్లా వాళ్ళు దిగే స్టేషన్ ఎక్కడ వచ్చేస్తుందో అన్న భయంకొద్దీ గుమ్మంలోనే మకాము వేసి, చూపులతోటే చుర చురా చూస్తూ వాళ్ల గమ్యం రావడంతో ఇక్కడ దిగాల్సివచ్చిందికాని, లేకపోతే మీ అంతు తేల్చేవాళ్లం అనే భావంతో ఆఖరిచూపు విసిరి దిగిపోతున్నారు. ఎప్పుడు నిద్రపట్టిందో పట్టింది. ఎన్ని స్టేషనులు వెళ్లాయో తెలియదు. నాగపూర్ లో మెళుకువ వచ్చింది. కొంచం కళ్లుమూసుకొని, పడుకునేవున్నా. ఇద్దరు ఆడవాళ్లు ఒక ఎలుకపిల్లలాటిపిల్ల, ఏడు, ఎనిమిది పెట్టెలు రెండు పక్క-చుట్టలు, నాలుగైదు బుట్టలు, యింకా చిల్లర సామానుకొంత-వీటితో ఎక్కి సర్దేందుకు ఉపక్రమించారు. వాళ్లని సాగనంపేందుకు వచ్చిన ఆయన, ఆయన పరివారం—నా కాళ్లని పక్కకూ చుట్టలతో తోస్తూ, నేను ఓ మూటాకారం వచ్చేటాకా జరిపారు నాకు కొంచెము విసుకువచ్చి వాళ్లశ్రమ వృధా అయ్యేటట్లు పక్క చుట్టని ఒక్క తన్ను తన్నాను. ఏమనుకున్నారో వాదనకి దిగకుండా మళ్ళాపక్క ఇవతలికి జరిపి .... పిల్లని పడుకో బెట్టి ఒకావిడని కూర్చోబెట్టారు. వీళ్ల దృష్టి మధ్య స్థలం మీదికి వెళ్లింది. "ఈ రథము లేచి కొంచెము చోటు యిస్తే బాగుండును," అనుకుని వాళ్ల మాటకి వాళ్లే మురిసిపోయి నవ్వుకుంటున్నారు. ఆ 'రథం' లేవటమూ, వాళ్లు సామాను పెట్టపోతే, తన స్థలంలో వద్దనీ, ఆమూల ఎల్లాగ సామాను వుంది కనుక అక్కడే మీవి కూడా పెట్టుకోమని తన భాషలో అమూల్యమైన సలహా యిచ్చి తను మళ్లా నిద్రకు ఉపక్రమిం

చింది. పరివారం రెండు పెట్టెలతో ఆమూలకి వెళ్ళటం, ఆ పెట్టె తాలూకు కోసు ఆవిడకు తగలడం, ఆవిడ ఒక్కతోపు తొయ్యటం పెట్టెతో సహా రథంలాంటి మనిషిమీద పడటం, ఆవిడ గాజులు తాలూకు కొన్ని పెళపెళలాడటం, పడ్డమనిషి 'సారీ' అని లేవటం — జరిగాయి. ఆవిడ ఎంత గట్టిగా మాట్లాడగలదో అంత గొంతుకతోటీ తన భాషలో మృదువుగా తిట్లు మొదలు పెట్టింది. ఇంతలో విజిల్ వెయ్యటం, పరివారంతో వచ్చినాయన ఖంగారుపడి దిగటంతో కాలుజారి క్రిందపడటం— "దెబ్బతగిలిందా" అని 'ఎరక్కపోయి బయలుదేరాము ఈపూట' అని 'మొదటి తరగతిలో ప్రయాణం చేస్తే ఈ గొడవలే వుండేవి కాదని' లోపల వాళ్లు యిద్దరూ పురాణంలా మాట్లాడ్డము మొగలుపెట్టేసరికి, రైలు కదలటం — 'నాకేం ఫరవాలేదు, మీరు జాగ్రత్తగా వెళ్ళండని' అవతలినుంచి అతను మాట్లాడటం, 'వెళ్ళగానే వైరు ఇస్తామని' లోపలినుంచి వీళ్ళ కేకలు — రైలు కూత, గార్డు విజిల్ – అన్నీ కలిసి చెవులు గింగిర్లెత్తాయి. కొంచెముసేపు నిల్చున్నట్టే నిల్చుని ఇంకోచోట కూర్చునేందుకు ధైర్యంలేక నా దుప్పటి ఎత్తి కాళ్లమీద పడేసి ఆస్థలంలో రెండో ఆమెకూడా కూర్చుంది. కొంతసేపు నిశ్శబ్దంగా గడిచింది.

మళ్లీ నాకు మెళుకువ వచ్చేసరికి ఆంగ్లయువతీ కొత్తగా ఎక్కిన ఈ ఇద్దరూ ఆంగ్లంలో హోరాహోరిని మాటలు వదులుకుంటున్నారు. నేను అప్రయత్నంగా లేచి కూర్చున్నాను. ఇంతలో ఏదో పెద్ద స్టేషను రావటం — గార్డు అటూ ఇటూ తిరుగుతూ ఈ గంద్రగోళం విని ఇక్కడకి రావటం — ఆంగ్ల

యువతి వాళ్ళపై నేరం చెప్పటం బట్టి అసలు విషయం 'యిదే' అని తెలిసింది — వాళ్ళ కూజా ఆవిడ చెయ్యి తగిలి పగిలిందిట— దాంతో ఈ గొడవ బయలుదేరింది. గార్డు ఏదో చెప్పి వెళ్లి పొయ్యాడు.

ఇంతలో ఇంకో ఇద్దరు కొత్తవాళ్ళు ఎక్కడంతో కొంత గొడవ తగ్గింది. వాళ్ళు పెట్టె నాలుగు మూలలా చూసి మధ్య స్థలంలో ఆవిడపైన చూపు నిలిపి చేత్తో ఆవిడని తట్టి లేపి ఆ స్థలంలో వాళ్ళు చతికిల పడ్డారు. వాళ్ళతో యుద్ధానికి దిగు దామని తెరిచిన నోరుని వాళ్ళ ఆకారాలు చూసి ఆవలింతగా మార్చి వాళ్ళతో పాటు ఒరిగి కూర్చుంది. వాళ్ళు ఈవిడకంటె ఒక చుట్టు ఎక్కువే వుంటారు. కానీ తక్కువ మాత్రం వుండరని చూసేవాళ్ళునిముషంలో కనుక్కోవచ్చు. వాళ్ళకి చోటు యివ్వ లేదన్న కోపం కొద్దీ ముందు ఎక్కినవాళ్ళు వాళ్ళని తెగ మెచ్చు కున్నారు.'మీరు కాబట్టి లేచింది—కాని మాతో యిందాక ఎంత గొడవ చేసిందో' అని. ఈ పెట్టె వాళ్ళ సొంతంలాగా చూసు కుంటున్నారనీ' ఇల్లా చెప్పుకు పోతున్నారు. కళ్ళతో సన్నా; ఎదర కూర్చున్నావిడని, పైన పడుకున్నావిడని చూపిస్తూ ఇంకా ఏవేవో చెప్పుకుపోతున్నారు. ఎదటి ఆవిడ సలహాతో ఒకావిడ నేను కూర్చున్న కిటికీమీద కాళ్లుపెట్టి పడకకు వుపక్రమించింది. నేను కొంచెం సర్దుకు కూర్చున్నా. ఆ కాళ్లు నెమ్మదిగా నా నడుముదగ్గరకి, తరువాత ఒళ్లోకి జారిపడటం మొదలుపెట్టాయి. నాకు ఒళ్లుమండి నిద్ర నటించే ఆవిడను కొంచెము గట్టిగా తగిలేటట్టు చేత్తో తట్టిలేపాను. ఆవిడ విసుగుకుంటూ 'అల్లా గట్టిగా కొట్టి లేపకపోతే నెమ్మదిగా పిలవచ్చుగా' అంటూ

సాగతియ్యటం మొదలు పెట్టింది. 'కాళ్లు మీదపడే సేటంత మొద్దు నిద్ర మీకు పడితే పిలిస్తే ఎక్కడ లేస్తారు మీరూ?' అన్నాను నేను.

"నిద్దట్లో పడితే పడ్డాయేమో – ఏమి చెయ్యమంటారు" అంది – 'ఏమి చెయ్యమంటాను – తీసి ఒంటికి దగ్గరగా పెట్టుకో మంటాను' – 'అబ్బో! చాలా తెలివిగా మాట్లాడా ననుకుంటు న్నట్టున్నారు – మీ నోరు దగ్గర పెట్టుకు మాట్లాడండి' – ఆవిడ సహాయానికి 'రెండో ఆవిడ' 'కొత్తవాళ్లు యిద్దరూ' మాటలు అందుకున్నారు.

ఇల్లా కొంతసేపు జరిగేసరికి పైన పడుకున్నావిడకి నన్ను చూసి జాలి వేసిందో ఏమో, ఆవిడ వాళ్లతో వాదనకి దిగింది. మనిషి అర్భకురాలైనా మాట మంచి జ్యాంకారంగా మాట్లాడు తోంది. ఆవిడ ఆసరాతో మిగిలినవాళ్లు యిద్దరు కూడా మాట కలిపి కసితీర మాటలు అందుస్తున్నారు. ఇప్పుడు 'నా పక్షమే ఎక్కువ వున్నారుకదా! అని ధైర్యంతో నేను కూడా గట్టిగానే మాట్లాడా. మధ్యలో ఎక్కిదిగే ప్రయాణీకులు తెల్లబోయి మమ్మల్ని, వాళ్లనీ చూస్తున్నారు. మా కీచులాట అప్రస్తుతంగా అనేక రకాల మాటల్లోకి దిగుతోంది. వేసుకున్న దుస్తులదగ్గ ర్నుంచి పెట్టుకున్న వస్తువుల్ని హేళన చేసుకోవటం, ఎవరికి ఏదితోస్తే అది అనటం జరిగింది. ఇల్లా టైం గడుస్తోంది. ఇంక తెల్లకి టైం అయింది. ఏదో స్టేషనులో రైలు ఆగింది. అంతా అంతా పక్క కిటికీల దగ్గరికి గుమ్మందగ్గరికి ఎగబడ్డారు. యీ వెళ్లటంలో వాళ్ల పక్షం మాట్లాడే వాళ్లలో ఒకరి కాలుకి వాళ్ల పెట్టె కొట్టుకుందిట. ఆ పెట్టెను సునాయాసంగా చిన్న

బంతిని తన్నినట్లు తన్నింది. వాళ్లు ఆవిడని ఏమీ అనలేక 'అయ్యో!' దాన్నిండా గాజుసామాను. ఏమయిందో, అనుకుంటూ, ఒకళ్ల కేసి ఒకరు చూసుకున్నారు. అల్లా చూసుకోవటం ఆవిడకి కష్టం తోచింది. ఏమో 'ఏమిచెయ్యమంటావ్' ఇంత సామాను ఎవరు తీసుకురమ్మన్నారు. దారిలో పెడితే ఎవరు వూరుకుంటారు. పగిలితే బైట పారేయ్' అని ఎదురు తిరిగేసరికి ఎటూ మాట్లాడలేక బిక్కమొగము వేసుకు కూర్చున్నారు.

ఎవరికి కావాల్సింది వాళ్లు తెప్పించుకుంటున్నారు. నేను చపాతీలు తీసుకున్నా. వాళ్ల క్యారియర్‌లో ఏదో తెచ్చుకున్నట్టున్నారు. 'మేము ఎక్కడపడితే అక్కడ అల్లా కొనుక్కు తినలేమని' వాళ్ల ఘనత కొంచెం చూపించారు. నన్ను ఉద్దేశించి 'యీరొట్టెలు అసలు తినలేము, తోళ్ళులాగ' అన్నారు. ఎదటివాళ్ళు కూడా రొట్టెలే తింటున్నారేమో - 'ఎప్పటిదో తెచ్చుకున్న చద్దివాటికంటే ఇవే ఎంతో కమ్మగా ఉంటాయి' అని వాళ్లే సమాధానం ఇవ్వటం జరిగింది. ఇంక ఎక్కువ గొడవలు లేకుండా చిన్న చిన్న మాటలతోటే బెజవాడ చేరుకున్నాం, తెల్లవారు ఝామున.

మావారు స్టేషనులో కనబడుతారేమోనని కిటికీ లోంచి చూస్తున్నా. దూరంగా మా నౌకరు గురవయ్య కళ్లు నులుపుకుంటూ వస్తున్నాడు. నేను కిందికి దిగాలంటే వాళ్ల సామాను అంతా దిగాక దిగాలి. యీ లోపల రైలు ఉంటుందో, వెడుతుందో - దైవాధీనం. నేను దిగాక వాళ్లకి చెప్పేందుకు వీలవదేమోనని నాతోటి ప్రయాణం చేసినవాళ్లకి

వెళ్లివస్తానని చెప్పాను. వాళ్ళు 'మీరు దిగండి. సామాను మేము అందిస్తాము, అని నాకు దారిలేక అటూఇటూ చూస్తుంటే 'ఆ పెట్టెలమీద అడుగుపెట్టి దిగమని' చెప్పారు. నా సామాను ఎక్కువలేదు కాబట్టి పెట్టె చేత్తో నేను పట్టుకుంటే, నా పక్కచుట్ట, 'చిన్నబుట్ట' చేతిసంచీ పైన ఉన్నావిడ అందించింది. వాళ్ళు ఇద్దరు మళ్ళా అంటున్నారు. 'అల్లా వాటిపైన నడవపోతే కిందికి తన్నెయ్యరాదూ! ఖాళీ అవుతుందని 'ఒకావిడ,' వాళ్ల సొమ్ము ఏం పోయింది, అని ఇంకో ఆవిడ సాగతీస్తున్నారు. జవాను గురవయ్య కనిపించాడు. వాడిని పిలిచి సామాను తీసుకోమన్నా. 'అయ్యగారూ! వచ్చారండీ! మీరు వస్తున్నట్టు చెప్పలేదండి! ఇంకెవరో ఆడంగులు వస్తున్నారు సామానుతోటి, ఎల్లి దింపుకోమని 'టెలిగ్రాం వచ్చిందని సెప్పారండి' – అసలు అయ్యగారే కాపడలేదండీ అప్పటినుంచి వెతుకుతుండా' 'సరే మనము వెడదాము పద' వాళ్ళు వెళ్లిపోయూరేమో చాలాసేపైందిగా రైలువచ్చి అన్నాను. 'మళ్ళీ ఓసారి సూడద్దంటూరా?' రాండి, పోదాము, మీరుండారుగా మీరు చెప్పితే తిట్టరులెండి"

మళ్లీ పెట్టెలో వాళ్లకేసిచూసి వెడతానని సైగచేసి యివతలికి వచ్చాము. 'మనకారు యీడే వుంది, అమ్మగోరూ! యీ పెట్టె యీడ పెడతా కూకోండి." అన్నాడు. 'రెండు రిక్షాలు మాట్లాడు వెడదాం, వాళ్ళు ఎంతమంది వున్నారో! ఇంటికి తాళంపెట్టి వచ్చారా అంటే లేదండి వంటాయన వున్నాడుగా అన్నాడు.

(6)

ఇంటికి వచ్చి నాపనులు పూర్తిచేసుకుని స్నానముచేసి, గురవయ్యచేత ఇల్లు సర్దించి తుడిపించాను. ఏడుగంటలైనా 'ఆయనకాని, 'ఆ వస్తారన్న వాళ్ళుకానీ' రాలేదు. గురవయ్య ఇంటికిపోయి వస్తానని పోయాడు. పెరట్లో కనకాంబరం మొక్కలు మోళ్ళలా వుంటే వాటికి మొదళ్ళు తవ్వటానికి కూర్చున్నా. వంటవాడు 'నేను తవ్వుతాలే అమ్మా' అంటూ వచ్చాడు, ఇంతలో కారు హారన్ విని బైటికివెళ్ళాడు గేటు తియ్యడానికి. హాల్లో సగంవరకూ సామానులు నిండాయి. 'అన్నీ వచ్చి నట్లేనా' అని మావారి కంఠం వినిపించింది. 'అబ్బ - ఎప్పుడూ ఆడవాళ్ల పెట్టెలో ప్రయాణం చేయకూడదండీ, బుద్ధివచ్చింది సగము సామాన్లు నాశనము అయ్యాయి అనుకోండి' అని చెప్పుకుపోతోంది. వంటఅయ్యరుని పిల్చి 'గురవయ్య వచ్చాడా, ఏడీ, అని అడుగుతున్నారు. 'అమ్మగారిని తీసుకు అప్పుడే వచ్చాడు. ఇప్పుడే యింటికిపోయాడు. "అమ్మ వచ్చారా ఎక్కడ? 'దొడ్లో మొక్కలుదగ్గర వున్నారు' అంటున్నాడు.

"ఏమిటీ ఈరాక ఉత్తరమైనా రాయలేదే వస్తూన్నట్టు" "రాశాననుకోండి. మీరు చూచుకుని వుండరు. చూచినా స్టేషన్ కి వచ్చేది గురవయ్యేకనక, వాడు కనపడగానే వచ్చేశా.' అన్నాను.

ఆయన తెల్లబోయి నాకేసిచూసి, "కోపము వచ్చి నట్లుందే రాణీగారికి. చూడు మా స్నేహితుడిభార్య, ఆవిడ చెల్లెలు వచ్చారు కాని, వాళ్ళకి ఏమికావాలో చూద్దూ, నా ప్రాణం తీస్తున్నారు ప్రొద్దుటనుంచీ."

'వాళ్లకేమికావాలో నాకేం తెలుస్తుంది — మీరే చూసుకోండి.'

'మంచిదానివికానీ, రా,' అంటూ చెయ్యిపుచ్చుకు లాక్కుపోతున్నారు. నేను చెయ్యి వెనక్కిలాక్కుని 'ఏమిటదీ కోతిచేష్టలు' - అంటూ హాల్లోకి తొంగిచూద్దునుకదా, రైల్లో నాతో ప్రయాణంచేసిన ఆ యిద్దరూ, అక్కచెల్లెళ్లు హాయిగా కాళ్లు పైకిపెట్టుకుని సోఫాలో కూర్చున్నారు. ఆపిల్లని ఏవో తినేందుకు ముందడేసి కింద తివాసీమీద కూర్చోపెట్టారు. తినేవి పొడిపొడిలాచేసి తివాసీమీద పోస్తోంది. దానికితోడు చొంగచేతులతో అలుకుతోంది - చూస్తే డోకు వచ్చేటట్టు చేస్తోంది.

నన్ను వాళ్ళకి పరిచయం చేశారు మావారు. నన్ను వాళ్లు చూడగానే మళ్ళీ ఇక్కడికి వచ్చినా ఈవిడ తప్పలేదను కున్న రోషమో, మాటరాక గుడ్లప్పచెప్పి చూస్తున్నారు — నాకు 'వాళ్లు మళ్ళా ఇక్కడ తయారయ్యారే' అనిపించింది. అందులో పెద్దావిడ కొంచెం తేరుకుని వాళ్ళ వారికి, రామారావుకి (అంటే మావారికి) వుండే స్నేహాన్ని వివరిస్తూ కొంత లెక్చరు ఇచ్చింది. తన చెల్లెల్ని రామారావుకి ఇవ్వకపోతే వాళ్ళ ఆయన అసలు పెళ్లిఅయితే రానని బెదిరించటము — జాతకాలు కలవలేదుకాని లేకపోతే ఆ పెళ్లి ఆపడానికి ఎవరి తరము అయ్యేదికాదని - అంచేత ఈ ఇంట్లో తనకి సర్వ హక్కులూ వున్నాయన్న ధోరణిలో మాట్లాడుకు పోతోంది.

అయ్యారు కాఫీతెచ్చి ఇచ్చాడు. కాఫీ తాగుతూకూడా 'తనచెల్లెలు అంటే రామారావుకి ఎంత ఇష్టమో వర్ణిస్తోంది.'

"మీరు బెనారస్‌నుంచి పంపిన చీరలు ఇంకా దానిదగ్గర వున్నాయి - అంత జాగ్రత్తగా దాచుకుంది." రామారావు మాట మార్చాలని "మీరు తొందరగా తెమిలితే చూడాల్సినవి చూసి వచ్చేయవచ్చు, మళ్ళీ మీకు టైము వుండదు" - "ఏమి వున్నాయి లెండి, ఇక్కడ చూసేందుకు - గుడికెళ్ళి వచ్చి, అల్లా వూళ్లో తిరిగివద్దాము" అంటూ సోఫాల్లో జార్లపడింది. మళ్ళీ మాట్లాడ్డము మొదలుపెడితే ఆగదనోఏమో 'తను స్నానంచేసి వస్తానని' లోపలికి వెళ్ళారు.

వాళ్ళు తెమిలి వెళ్లేందుకు సిద్ధము అయ్యేసరికి పది గంటలు దాటింది. ఆయన నన్ను కూడా రమన్నారు. 'నాకు వంట్లో బాగాలేదు రాలేను' అన్నా.

"అయితే మా పిల్లని ఇంట్లో వుంచమంటారేమిటి - మీరు వుంటారు కనక' అంది. అసలే వళ్లు మండుతోంది వాళ్ళ మాటలతోటి - 'నాకు పిల్లల్ని ఆడించడం రాదండి - మీతోటే తీసుకువెళ్లండి' - అని చెప్పేశాను. 'అంతగా ఏడిస్తే ఆయన వున్నారుగా ఎత్తుకుంటారు' - అని కసిగా చెప్పాను. వాళ్లు తిరిగి రెండు గంటలు అయ్యాక వచ్చారు. రామారావు పెందరాలే భోజనంచేసే అలవాటువున్నవాడేమో కొంచెము తలనొప్పి వచ్చింది, ఆలస్యము అయినందుకు. వాళ్లు భోంచేస్తున్నారు. 'అమ్మో, సాపడలే' అంటున్నాడు అయ్యరు. 'అమ్మని పిలు' అన్నారు. అయ్యరు వచ్చి 'పిలుస్తున్నారు అమ్మా' అన్నాడు. వచ్చి దూరంగావున్న విస్తరిముందు కూర్చుని మాట్లాడకుండా తలవంచుకు భోంచేస్తున్నా. అప్ప గారు చెల్లెలిని సాధించటం మొదలుపెట్టింది. గుళ్ళోంచి 'ఏవే

శకీ మీరు రారామెరీ, పిల్లగోల పట్టుకో లేకపోయాను – మీరు తొందరగా వచ్చివుంటే వాళ్ళయింటికి కూడా వెళ్లివచ్చి, వుండేవాళ్ళం.' ఆమాటవింటే నాకు ఎందుకో మనస్సు చివుక్కు మనిపించింది. తను ఎన్నోసార్లు గుడికి రమ్మంటే 'నువ్వు వెళ్ళి వద్దూ' అనేవారు. చెల్లెలు – 'నువ్వు మహా తొందరగా తెమిలే టట్టూ, – ఇవతలవాళ్ళని అంటావు – అయినా నీతో ప్రయా ణము ఏమిటే నాకు'!

వాళ్లవాదన పూర్తి అయేసరికి, నాలుగైంది. 'ఈ బండికి వెళ్ళం, రాత్రి బండికి వెళ్తాం' అన్నారు వాళ్ళు. మళ్ళా రామారావుకి చెరోపక్కా కూర్చుని సోది మొదలుపెట్టారు. రాత్రి భోజనముచేసి బయలుదేరారు. అంతవరకూ నేను వాళ్లని తప్పించుకు తిరుగుతున్నా – మాట్లాడినా ముభావంగా సమాధానము చెపుతూ గడిపాను. రాత్రి భోజనము చెయ్య లేదు – ఆకలి లేదనిచెప్పి, ఆయన స్టేషన్‌కి రమ్మంటే వంట్లో బాగా లేదని చెప్పి తప్పించుకున్నా. ఆ రైలు రెండుగంటలు ఆలస్యం అవటంనుంచి ఆయన తిరిగి వచ్చేసరికి చాలా ప్రొద్దు పోయింది. నేను బయట మంచం వేసుకుని పడుకున్నా. ఆయన వచ్చి నన్ను లేపకుండా మడతమంచము తెచ్చి వేసుకుని పడు కున్నారు – కొంచెముసేపట్లో నిద్రపట్టింది. నాకు అసలు నిద్ర పట్టలేదు. నన్ను లేపితే ఏరకంగా అతన్ని అనాలో, ఆలోచిస్తూ పడుకున్నాను. లేపకపోవడమే కాకుండా, నిశ్చింతగా – నిద్ర పోవడం చూస్తే వళ్ళుమండింది. 'గిల్లి రక్కుదామా' అన్నంత కోపం వచ్చింది. కోపాన్ని మంచంలో రుద్దుతూన్నట్టు, ఇటూ, అటూ పొర్లుతూ, చివరకి మంచముపట్టె దగ్గరగాజరిగి, కళ్ల

నీళ్ళతో నవ్వారు తడుపుతూ, ఎప్పుడో నిద్రపోయాను. మెళుకువ వచ్చేసరికి బాగా పొద్దుఎక్కింది. ఆయన లేవకపోవటం చూసి నేను మళ్ళీ పడుకున్నా. వాకిట్లో గుర్రబండి ఆగిన చప్పుడైతే తలెత్తి చూశాను. మళ్ళా అక్కా, చెల్లెలు సామానుతో సహా దిగారు, వాళ్లని చూడగానే బుర్రలో ఏఆలోచనా లేకుండా ఖాళీ అయింది. కొంతసేపటికి తేరుకుని 'మళ్ళీ ఎల్లా వచ్చారా' అని ఆలోచన వచ్చింది. బండివాడు డబ్బు ఎక్కువ అడిగాడని వాణ్ణి ఇద్దరూ కలసి కేకలు, తిట్లు మొదలుపెట్టారు. వూరుకోకుండా వాడూ అంటున్నాడు. ఆ గోలకి 'మావారు' ఖంగారుపడుతూ లేచి 'ఏమిటీ' అన్నట్టు ప్రశ్నార్థకంగా నాకేసి చూశారు. సమాధానంగా వాళ్లని చూపించా. "వాళ్ళు మళ్ళీ ఎల్లావచ్చారో అర్థంగాక, మళ్ళీ పడుకుని తెల్లపోయి చూస్తున్నారు. పెద్దావిడ రొప్పుకుంటూ వచ్చి, వాడు మర్యాద లేకుండా ఎల్లా మాట్లాడుతున్నాడో, రెండు తన్ని పంపు". చిన్నావిడ వాడిని ఎల్లాగో సాగనంపి సినిమాల్లో హీరోయిన్‌లా ఫోజుపెట్టి వయ్యారంగా నడుస్తూ వచ్చింది. 'తను కాబట్టి వాడిని పంపగలిగిందట. 'పెద్దావిడను చూస్తే ఎవ్వరూ లెఖ్ఖ చెయ్యరు' అనేసరికి ఆవిడకు దుఃఖమువచ్చి ఏడుపు మొదలుపెట్టింది. ఇద్దరూ వాదనలోకి దిగారు. నేను లేచి లోపలికి వెళ్ళాను. నావెనక వారూ వచ్చారు - నాతో ఏదో చెప్పబోయారు. ఇంతలో పెద్దావిడ "పిల్లకి పాలు యివ్వమనండి, ఏడుస్తోంది. అయ్యరుతో చెప్పండి తొందరగా" అంటూ తన ధోరణి మొదలుపెట్టింది. అందరికీ కాఫీలు తెచ్చి యిచ్చాడు అయ్యరు. వాళ్లు రాత్రి ఎక్కిన పెట్టెలో తెలిసిన అతను ఎక్కా-

డట. వీళ్లని 'ఎక్కడకని' అడిగితే వీళ్లు వెళ్లే పెళ్ళివాళ్ల ఇంటిపేరు, యజమానిపేరు చెప్పేసరికి ఆయన తెల్లబోయి, 'అరె వాళ్లు అంతా నిన్నే తిరుపతికి వెళ్లారు, కొండమీద చేస్తున్నారు పెళ్ళి, మీకు తెలువదా' అని అడిగాడట. 'ఇప్పుడు ఏం చెయ్యడం' అని వాళ్లు అనుకుంటే, అతనే 'వచ్చే జంక్షన్‌లో దిగి బెజవాడ వెళ్ళేబండి ఎక్కండి, తరువాత తిరుపతి మీరు వెళ్లవచ్చు' అని సలహా ఇచ్చాడుట. అతని సహాయంతో 'ఆ బండిలోంచి', ఈ 'బండిలోకిమారి', – 'ఎంత అవస్తపడి ఇక్కడికి వచ్చారో' చెప్తూకుపోతోంది. మావారు మధ్యలో ఆపి 'ప్యాసింజరుకి వెడితే మీరు రాత్రికి తిరుపతికి చేరేవారుగా' అన్నారు. చిన్నావిడ 'నేను మాత్రం ఇంక ప్రయాణము చెయ్యలేను. మా అక్క కావాలంటే వెడుతుంది' అని సోఫాలో కాళ్ళు జాపుకు ఏటవాలుగా జార్లపడి కళ్లు సగము మూసుకు పడుక వేసింది.

"అదేమిటే పెళ్లికనివచ్చి ఇక్కడ కూర్చుంటే ఏమి బాగుంటుందీ, కావాలంటే మళ్ళీ వెళ్లేటప్పుడు నాలుగురోజులు వుండివెడదాము. ఏం రామూ అంతేనా" అంది పెద్దావిడ. 'తప్పకుండా వెళ్ళాలి లేకపోతే బాగుండదు' అన్నారు మావారు. "బాగున్నా లేకపోయినా నేను మాత్రం రాలేను' అని భీష్మించుకు కూర్చుంది చిన్నావిడ.

'అంత ఇష్టములేకపోతే మానెయ్యటమే మంచిదని' నీరసంగా నవ్వుతూ అన్నాడు రామారావు. ఏదో పనివున్నట్టు లోపలికి వెళ్లి కొంచెంసేపట్లో శుభలేఖ ఏదో చేత్తోపట్టుకువచ్చి 'వెంకటేశం పెళ్లి 'అని చెప్పలేదేనాకూఅని చురచురాచూశాను.

‘అన్నట్లు మర్చిపోయాను, చెప్పటం. పోనీ దగ్గరేగా వెళ్లివద్దాము, కార్లో వెళ్లవచ్చులే’ అన్నారు. పెద్దావిడ ‘పోనీ ఆవిడని వెళ్లనివ్వండి’ అని సలహా ఇచ్చింది. ‘అసలు పెళ్ళికొడుకు తనకే బంధువని, తను వెళ్ళకపోతే బాగుండదని చెప్పి, శాంతని వెళ్లేందుకు బట్టలు సర్దమని పురమాయించాడు,’ రామారావు.

‘మీరు వెడితే మేము ఏం చెయ్యాం యిక్కడ? లేవే వెడదాం’ అని చెల్లెలుని బతిమాలింది. వాళ్ళని ప్యాసింజరులో ఎక్కించి మరీ వెళ్ళమని రామారావుకి పురమాయించింది, ఆవిడ. ‘పోనీ కొంతసామాను ఇక్కడ పెట్టివేస్తే,’ అంది చెల్లెలు. ‘మళ్లా అన్నీతీసి సర్దుకునేందుకు టైము వుంటుందా,’ అని రామారావువంక చూసింది, రామారావు వాచీ కేసి... చూస్తోనే సమాధానము ఇచ్చాడు—‘టైము లేదు. అయినా పెళ్ళివారి సామానులో మీ దెంత? వచ్చేటప్పుడు వాళ్లే చూసుకుంటారు. ఇప్పుడు నేను రైలు ఎక్కిస్తానుగదా’ అని, అయ్యరుని పిలిచి ‘జట్కా తీసుకొచ్చి సామానుతీసుకు స్టేషన్‌కి వెళ్లమని’ చెప్పి, తను బట్టలు మార్చుకునేందుకు లోపలికి వచ్చారు. నేను పెట్టెమీదకూర్చుని, మళ్ళీ రానంటే ఏమౌ, అని ఆలోచిస్తున్నా, ‘ఏమిటె, ఇంకా ఆలోచన? లే’అని చెయ్యి పట్టుకుని పైకిలాగారు, ‘మీరు వాళ్ళని పంపిరండి. ఇక్కడ నుండి వెళ్లవచ్చు’ అన్నాను. ‘సర్లే, రద్దూ’ అని లాక్కు పోతున్నారు. ‘అబ్బా, వుండండి. చీరమార్చుకువస్తా’ అన్నాను.

అంతా తెమిలి వెళ్లేసరికి రైలు వచ్చేటయిమ్ అయింది. తొందరగా టిక్కెట్టు తీసుకుని ఎక్కడ ఖాళీవుందో పెట్టెలు

చూసుకుంటూ ఆడవాళ్ల పెట్టె ఖాళీగావుందని, అందులో సామానుతో వాళ్లని ఎక్కించారు—

'ఒరే అబ్బాయీ—రామం' అంటూ వెనకనుంచి కేక వినిపించింది. ఆయాసపడుతూ పార్వతమ్మగారు ఆ పెట్టెదగ్గరికి వచ్చింది.

'మీరు ఎక్కడికి వెళ్తున్నారో కోడలా' అంటూంటే మావారు "ముందు నువ్వు ఎక్కు టైము అయింది" అని చెయ్యి పట్టుకు పెట్టెలోకి ఎక్కించారు.

'అబ్బాయీ. పరుపుల పెట్టెలాగుందే, నా టిక్కెట్టు ఇదికాదుగా, చూడు' – 'ఫరవాలేదు కూర్చో, గార్డుకి డబ్బు ఇచ్చి మార్చుకోవచ్చు' నువ్వు దిగితే వేరేదాంట్లో ఎక్కేందుకు వ్యవధి వుండదు' అని టిక్కెట్టు తీసుకు గార్డుదగ్గరికి వెళ్ళాడు.

'నువ్వు ఎక్కవేమే శాంతా?' అంటే 'మేము రావటం లేదు తెలిసినవాళ్ళు వస్తే, వాళ్ళని రైలు ఎక్కించేందుకు వచ్చాము – మీరు వెంకటేశం పెళ్లికి వెళ్లటంలేదా?' అన్నాను.

"నేను ఇప్పుడు అక్కడనుంచేగా వస్తోంటూ. వారమయింది, నేను వెళ్లి – పెళ్ళి ఆగిపోయింది. పెళ్లికూతురు బొమ్మ అకస్మాత్తుగా పోయిందట. అబ్బాయికి తెలుసు అనుకుంటూ – వెంకటేశం చెప్పాననన్నాడు"

'ఏమో నాకు తెలియదు. నేను నిన్న నే వచ్చానని చెప్పి రైలు బయలుదేరబోతోందని' చెప్పాను. గబగబా వచ్చి

మావారు ఆవిడ టిక్కెట్టు ఇచ్చేసరికి రైలు కదిలింది. ఆవిడ వూరుకోక 'వెంక టేశం పెళ్ళి ఆగిపోయినట్టు నీకు తెలుసుకదరా?' అని ప్రశ్నించింది. 'వాళ్లు ఎక్కడ విన్నారో' అని 'వాళ్ల కేసి చూస్తున్నారు మావారు. వాళ్లు పక్కలు పర్చుకు ఎవరేనా వచ్చినా లేవకుండా వుండేందుకు వీలుగా అన్నీ మూలకు చేర్చు కుంటున్నారు. 'మరి మేము వెళ్లమా' – అని వాళ్లతో అంటూ – రైలుతో నడుస్తున్నారు.

'చాలా థ్యాంక్సు – మళ్ళా వచ్చి మీ ఇంట్లో నాలుగు రోజులు వుండకుండా ఎల్లాగా వెళ్లము – మీరు వుండండి' – అని చేతులు వూపుతున్నారు. "అమ్మడూ, శాంతా వెళ్ళి వస్తానే, అబ్బాయి నువ్వు బాపట్ల రారాదూ" అని రైలు వెడు తున్నా, పార్వతమ్మగారు గట్టిగా చెబుతున్నారు.

రైలు వెళ్ళిపోయింది. మేము బైటికి వచ్చేదాకా మాట్లాడుకో లేదు. అయ్యారుని ఇంటికి వెళ్ళి వంట చెయ్యమని మేము మధ్యాహ్నానికి వస్తామని చెప్పారు. నేను ఇంటికి వెళ్ళి పోతానన్నా, గొడవ చెయ్యక కార్లో ఎక్కమన్నారు. దూరంగా జరిగి కూర్చున్నా పెళ్ళి ఆగిపోయినట్టు మీకు తెలుసునటగా– 'నాకు తెలవదుగా, వాళ్లని పంపుదామని'

'అన్నీ అబద్ధాలు – పైకి వాళ్ళు అంటే ఇష్టం లేనట్లు– ఇష్టం లేకపోతేనే రైలు వెడుతున్నా కూడా నడుస్తూ మాట్లా డారు కాబోలు, అంత ఇష్టం వున్నవాళ్లు ఆవిడనే చేసుకో వల సింది – నన్నెందుకు చేసుకున్నారు' – అన్నాను.

'నిన్ను చేసుకుని ఏడిపిద్దామని' 'వాళ్లు మిమ్మల్ని ఏడి పిస్తున్నారు – అవునా? అంటే ఆయన నవ్వేశారు. ★